క్లుప్తంగా

ఉపాధ్యాయుడు మోహన్‌రావుకు సన్మానం



మూలపాడు(ఇబ్రహీంపట్నం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందిన మూలపాడు జెడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొచ్చెర్ల మోహన్‌రావును పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్ మాట్లాడుతూ మోహన్‌రావు వృత్తిపరంగా క్షణం తీరిక లేకుండా విద్యార్థులకు బోధన చేస్తూనే ఖాళీ సమయంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత మోహనరావు మాట్లాడుతూ డాక్టరేట్ మరింత బాధ్యత పెంచిందని అన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాగన్ వర్క్‌షాప్ ఉద్యోగుల నిరశన

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): సమస్యల పరిష్కారం కోరుతూ గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు మెయిన్ గేట్ వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. బ్రాంచి కార్యదర్శి ఎంపీఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన డీఏను వెంటనే చెల్లించాలని, సూపర్‌వైజర్ గ్రూప్ బి స్టేటస్, లెవల్ 8, 9 పోస్టులకు ప్రమోషన్ వ్యవధి 4 నుంచి రెండేళ్లకు తగ్గించాలని, మహిళా కార్మికులకు ప్రతి నెలా మూడు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని, రూ.4,800 గ్రేడ్ పే ఉన్న వారికి నైట్ డ్యూటీ అలవెన్స్, యూనిఫైడ్ పెన్షన్ విధానంలో మార్పులు చేపట్టాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బ్రాంచి చైర్మన్ తమ్మా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ డివిజన్ కార్యదర్శి ఓ.రామయ్య, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు అక్కల శ్రీనివాసరావు, సురేష్, ఆనంద్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను సస్పెండ్ చేయాలి



జి.కొండూరు: మైలవరం మండల పరిధి మొరుసుమల్లి హత్య కేసులో సంబంధంలేని వ్యక్తి వడ్లపూడి సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులు, ఆదేశించిన ఉన్నతాధికారులను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కోట డానియల్ మాదిగ అన్నారు. ఈ మేరకు దళిత సంఘాల నాయకులు జి.కొండూరు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫిక్సెడ్ డిపాజిట్ పత్రాలు అందజేత



విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. కూనపరాజుపర్వకు చెందిన రిటైర్డు ప్రొఫెసర్ పీవీ కృష్ణారావు తన తల్లిదండ్రులు పొన్నగంటి నాగేశ్వరరావు, అనసూయ జ్ఞాపకార్థం రూ.లక్షా 10 వేల 116 నగదును బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేశారు. డిపాజిట్‌పై వచ్చే వడ్డీ సొమ్మును మెరిట్ విద్యార్థికి అందించనున్నట్లు కృష్ణారావు తెలిపారు. ఫిక్సెడ్ డిపాజిట్ బాండును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె. రంగారెడ్డికి అందజేశారు.

తాతకుంట్లలో 'పొలం పిలుస్తోంది'



విస్సన్నపేట: మామిడి తోటల్లో నల్ల తామర పురుగు ఉధృతంగా ఉందని విస్సన్నపేట మండల ఉద్యాన అధికారి నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని తాతకుంట్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నల్ల తామర పురుగు నివారణకు సాయంత్రం వేళల్లో మంటలు వేయాలని, పసుపు, నీలిరంగు అట్టలను ఏర్పాటు చేయడం ద్వారా తామర పురుగు నివారించవచ్చని వివరించారు. వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద కేంద్రాలు



సంపద తయారీ కేంద్రంలో ఎరువులు తయారు చేసే తొట్టెలు



సంపద తయారీ కేంద్రంలో ఎరువులు తయారు చేసే యంత్రం

- చెత్త నుంచి ఎరువుల తయారీ లక్ష్యం
- గ్రీన్ అంబాసిడర్ల ఏర్పాటు
- నిర్వహణ లోపంతో నిరుపయోగం
- అందుబాటులోకి తేవాలని రైతుల వినతి

మైలవరం: రైతులకు నాణ్యమైన, తక్కువ ధరలో ఎరువులు అందించే ఉద్దేశంతో 2017లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిపై పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో ఇప్పుడవి నిరుపయోగంగా మారాయి. రైతులకు సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. ఫలితంగా భూములు సారం కోల్పోయి దిగుబడులు తగ్గుతున్నాయి.

అప్పట్లో ఇలా..

ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా రూ.5.75 లక్షల వ్యయంతో కేంద్రాల నిర్మాణం చేపట్టి ఎరువులు తయారు చేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. ఆయా సంపద కేంద్రాలలో ఎరువుల తయారీకి తొట్టెలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామానికి గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారి ద్వారా గ్రామాల్లో చెత్తను సేకరించి కేంద్రానికి తరలించేవారు. సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి యంత్రాల ద్వారా చెత్తను సేంద్రియ ఎరువుగా తయారు చేసి తొట్టెలలో నింపేవారు. ఈ విధంగా తయారైన సేంద్రియ ఎరువును కిలో రూ.20 చొప్పున రైతులకు విక్రయించేవారు.

ప్రస్తుత పరిస్థితి..

కూటమి ప్రభుత్వం, అధికారులు చెత్త నుంచి సంపద కేంద్రాలపై దృష్టి పెట్టక పోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మైలవరం మండల పరిధిలో అత్యధికంగా వరి, మొక్కజొన్న, మల్లె తోటలు, మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇప్పటికే మామిడి తోటల్లో రైతులు పైపాటు పనులు ప్రారంభించారు. ఈ సమయంలో వారికి ఎరువులు ఆవశ్యకత ఉంది. అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



మాకు కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉంది. దానిలో వరి సాగుచేస్తున్నా. రసాయనిక ఎరువులు వాడటం వలన భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గుతోంది. వ్యవసాయాధికారులు సేంద్రియ ఎరువులు వాడాలని సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులు అందుబాటులోకి తీసుకువస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. – డి. చలపతి, రైతు, పొందుగల

అధికారులు స్పందించాలి



సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల భూ సారం పెరుగుతుంది. పంట దిగుబడి కూడా ఎక్కువగా రావడంతో పాటు ఆరోగ్యం వంతమైన పంట ఉత్పత్తి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలి. – కె.కొండలరావు, గుర్రాజుపాలెం

ట్రిపుల్ ఐటీ కాంప్లెక్స్‌లో షాపులు ఏర్పాటు చేయండి

విద్యార్థులు, ఫ్యాకల్టీ వినతి



నూజివీడు ట్రిపుల్ ఐటీలోని షాపింగ్ కాంప్లెక్స్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో షాపులను షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ఫ్యాకల్టీ ముక్తకంఠంతో కోరుతున్నారు. ట్రిపుల్ ఐటీలో 6,600మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండటం, మరో వెయ్యి మంది సిబ్బంది ఉన్న నేపథ్యంలో వీరందరి అవసరాల కోసం ఎంతో ముందు చూపుతో ప్రారంభంలోనే ట్రిపుల్ ఐటీలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. దీనిలో ఫ్యాన్సీ, సూపర్‌బజార్ వంటి షాపులు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే ప్రారంభంలో ఆడిటోరియం గాని, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ భవనం లేకపోవడంతో షాపింగ్ కాంప్లెక్స్‌ను విద్యార్థులకు యోగా నేర్పేందుకు గాను పదేళ్ల కిందట కేటాయించారు. అప్పటి నుంచి ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసే షాపులను బాలుర, బాలికల హాస్టల్స్‌లోని గదుల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఆ తరువాత ఆడిటోరియం, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌ను నిర్మించారు. అందులో మూడు ఇండోర్ స్టేడియాలను సైతం నిర్మించారు. ఈ సెంటర్‌లోనే నృత్యం, సంగీతం, క్రీడల విభాగాలకు కేటాయించారు. యోగా విభాగాన్ని కూడా స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌కు తరలిస్తే షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు ఏర్పాటు చేసేందుకు వీలవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో అయితే బాలికలు, బాలురు యోగా చేసుకోవడానికి ఎంతో అనువుగా ఉంటుంది. షాపులను ఇక్కడ ఏర్పాటు చేస్తే విద్యార్థులతో పాటు క్వార్టర్స్‌లో ఉండే ఫ్యాకల్టీ, వారి కుటుంబ సభ్యులు సైతం కొనుక్కోవడానికి వీలుంటుంది. హాస్టల్స్ లోపల ఫ్యాన్సీ షాపులు, సెలూన్‌లు వంటివి ఉండటంతో లోపలికి ఫ్యాకల్టీ, వారి కుటుంబ సభ్యులు వెళ్లడానికి వీలుండటం లేదు. ఈ నేపథ్యంలో యోగా సెంటర్‌ను స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌కు తరలించి షాపులను అందరికి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరుతున్నారు.

పర్యాటక ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలి

ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ



శుభ్రం చేస్తున్న పర్యాటక స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నూకసాని బాలాజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో మంగళవారం ఆయన అధికారులతో కలిసి పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈనెల 14వ తేదీన తొలుత ఆ స్థలాన్ని ఆయన సందర్శించారు. పిచ్చి మొక్కలతో నిండిన ఆ ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీనితో ఆ ప్రదేశంలో పిచ్చి చెట్లు, ముళ్ల పొదలను తొలగించే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం మరోసారి అధికారులతో కలిసి సందర్శించి పనులపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక శాఖ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో పర్యాటకులకు అవసరమైన బెంచీలు, పార్కింగ్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతంలో ఉన్న పర్యాటక షాపింగ్ కాంప్లెక్స్‌లో పర్యాటకుల సౌకర్యార్థం రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రదేశాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. ఆయనతోపాటు ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పి. కృష్ణచైతన్య, హరిత బెరంపార్క్ మేనేజర్ కె. శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ కొల్లి శ్రీధర్, డీఈ శ్రీనివాస్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జోన్ ఆటల పోటీలకు ఏర్పాట్లు పూర్తి

ఆగిరిపల్లి: సబ్ జోన్ ఆటల పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రధానోపాధ్యాయిని పుష్పలత అన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్లో నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి ముసునూరు, నూజివీడు, చాట్రాయి మండలాల్లోని విద్యార్థులకు సబ్ జోన్ ఆటల పోటీల ఏర్పాట్లను ప్రధానోపాధ్యాయిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 21న బాలురకు, 22న బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల ఇన్‌చార్జి పీడీ శివనాగేంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సుగుణరావు, ఉమా నాగరాజు, రవీంద్ర, ప్రభాకర్, నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక విద్యను మెరుగుపరిచేందుకు, ఆటల ఆధారంగా నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పుష్పలత, రిసోర్స్ పర్సన్లు అంకం వెంకటేశ్వరరావు, డేవిడ్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి పాల్గొన్నారు.

3,097 మందికి గుర్తింపు కార్డుల నమోదు

తిరువూరు: రైతు గుర్తింపు కార్డుల జారీకై మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో డేటా ఎంట్రీ జరుగుతోందని, ఇంతవరకు 3,097 మంది రైతుల పేర్లు నమోదు చేశామని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. తిరువూరులోని రైతు సేవా కేంద్రంలో గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు ఈ గుర్తింపు కార్డులను పొందితేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకు అర్హులవుతారన్నారు. మండలంలో మొత్తం 8 వేల మంది రైతులకు గుర్తింపు కార్డులు జారీచేయనున్నామని ఏఓ చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమ్యకీర్తనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు తమ్మిశెట్టి సుబ్బారావు, నరసింహారావు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలని, అవుట్ సోర్సింగ్, పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

22, 24 తేదీల్లో ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ నెల 22న, హెటిరో ల్యాబ్ ఈనెల 24న తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తాయని విస్సన్నపేట వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలైటికల్ కెమిస్ట్రీ, డిప్లమోలో మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు ఈ ఎంపికకు అర్హులని చెప్పారు. వికాస్ పీజీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు సెల్: 98495 53107 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పరుపుల పంపిణీ




నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పరుపులు అందజేశారు. 1,100 మంది విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. వాస్తవానికి అడ్మిషన్ల సమయానికే వారికి కేటాయించిన హాస్టల్ రూముల్లో పరుపులను సిద్ధంగా ఉంచాలి. అప్పట్లో పరుపులను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచలేదు. అప్పటి నుంచి పలువురు విద్యార్థులు పరుపులు లేకుండానే ఉండగా, మరికొందరు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్నారు. పరుపులను కొనుగోలు చేసి వాటిని విద్యార్థులకు అందజేశామని డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ తెలిపారు.

హైవేపై కంకరతో ప్రమాదాలు

దొనబండ(ఇబ్రహీంపట్నం): కంకర లోడు లారీల రాకపోకల సమయంలో రోడ్డుపై పడుతున్న కంకరతో దొనబండ గ్రామ పరిధిలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని కాచవరం ఎంపీటీసీ సభ్యుడు ముద్దంగుల రంగస్వామి మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎక్కువగా స్టోన్ క్రషర్లు, క్వారీల ద్వారా వచ్చే కంకర మెటీరియల్ లారీలతో రవాణా చేసే క్రమంలో రోడ్డుపై చెల్లాచెదురుగా కంకర రాళ్లు పడుతున్నాయన్నారు. సుమారు 500 మీటర్ల దూరంలో పడిన కంకరపై వాహనదారులు ప్రయాణించలేకపోతున్నారని చెప్పారు. లారీలపై నుంచి రోడ్డుపై కంకర పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రామకృష్ణ పరమహంస జయంతి



తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక తత్వవేత్త రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. విభిన్న మతాలు భగవంతుని చేరటానికి విభిన్న మార్గాలను చూపుతాయని రామకృష్ణ పరమహంస ప్రపంచానికి చాటి చెప్పారని సాయిబాబా యూత్ కమిటీ కన్వీనర్ ఊటుకూరు యజ్ఞకృష్ణ తెలిపారు. విద్యార్థులకు రామకృష్ణ పరమహంస బోధనలు వివరించారు.

ఐక్యతతో సమస్యల పరిష్కారం

నూజివీడు: ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం మంగళవారం నూజివీడు పట్టణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, బాలు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు సంఘటితంగా ఉంటే అసోసియేషన్ మరింత బలోపేతమవుతుందన్నారు. ఐక్యతతో సమస్యలను సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నూజివీడు డివిజన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాస్, కంచర్ల లవకుమార్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

మైలవరం: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని, వీరి పాలనలో మిర్చి రైతులు రోడ్డున పడ్డారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ధ్వజమెత్తారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు చాట్ల సుధాకరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో బాబూరావు మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల జాడేలేదని, ఉన్న ఉద్యోగాలకు ఈ ప్రభుత్వం ఎసరు పెడుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను, ప్రజా సమస్యలను మరిచి కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ వేయడం, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. డీఎస్సీ ప్రకటనలకే పరిమితమైందని, అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ప్రకటన, ఎమ్మెల్సీ ఎన్నికల స్టంట్ తప్ప ఉద్యోగుల మీద ప్రేమ కాదన్నారు. ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆలోచించి నిర్ణయం తీసుకుని ఓటు వేయాలన్నారు. జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, మిర్చి పంట తెగుళ్ల బారిన పడి దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారన్నారు. పేను బంక, ఇతర తెగుళ్లతో మామిడి, మొక్కజొన్న రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ కోటమ్మ

మైలవరం: గ్రామంలో వైరస్‌లు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పొందుగల సర్పంచ్ గుగులోతు కోటమ్మ అన్నారు. పొందుగల గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను మంగళవారం సర్పంచ్ పరిశీలించి మాట్లాడారు. విష జ్వరాలు, సీజనల్ వ్యాధులు, బర్డ్ ఫ్లూ వంటి వైరస్‌ల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తాగునీటి వాటర్ ట్యాంకులు, నివాసాలకు సరఫరా చేస్తున్న నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. జనావాసాలకు చేరువలో ఉన్న నీటి గుంటలను పూడ్చి దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామంలో ఫాగింగ్ స్ప్రే చేయిస్తున్నామని చెప్పారు. బర్డ్ ఫ్లూపై వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈఓ సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది, వైద్య, ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపాధి, ఆహార భద్రత కల్పించండి

సీపీఐఎంఎల్ లిబరేషన్

నూజివీడు: దేశ ప్రజలకు ఉపాధి, ఆహార భద్రత కల్పించడంలో పాలక పార్టీలు వైఫల్యం చెందాయని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు ఉద్దేశించిన జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల్లో కోతలు పెట్టి పని దినాలను తగ్గించారని విమర్శించారు. యంత్రాలను వినియోగించి ప్రజల ఉపాధిని హరిస్తున్నారన్నారు. భారత్ వెలిగిపోతోందని, దేశ ప్రధాని మోదీ నుంచి చంద్రబాబు వరకు విజన్ 2047 లాంటివి సృష్టిస్తూ ప్రజలను ఊహా ప్రపంచంలో విహరించేలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు అందించాలని హరినాథ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించే విధంగా పాలక ప్రభుత్వాలపై ప్రజలు ఒత్తిడి తీసుకురావాలన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని కోరుతూ సీపీఐ ధర్నా



తిరువూరు-అడసర్లపాడు రోడ్డుపై ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తిరువూరు: తిరువూరు నుంచి ఖమ్మం జిల్లా అడసర్లపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయమై వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రోడ్డును నిర్మించాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించారు. గత పదేళ్లుగా ఈ రహదారిపై ఆటోలు, ఇతర వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయని, పలువురు క్షతగాత్రులవుతున్నారని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. రహదారిని 100 అడుగుల మేర వెడల్పు చేసి పూర్తి స్థాయిలో నిర్మించాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఐ నాయకులు నాగులమీరా, చిలకూరి వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ఉదయ్, సుబానీ, హసన్ తదితరులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఉద్యాన శాఖాధికారి హేమ



పోలవరంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి హేమ

చాట్రాయి: మామిడి, ఆయిల్‌పామ్ పంటలకు మంచి యాజమాన్య పద్ధతులను చేపట్టడం ద్వారా పంటను రక్షించుకుని, అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారి ఆర్. హేమ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని పోలవరం, పోతనపల్లి, చీపురుగూడెం మామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో పంటను ఆమె పరిశీలించారు. మామిడి పంట రక్షణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. తామర పురుగు, తేనె మంచు పురుగు నివారణకు అవసరమైన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శివశంకర్, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయానికి కుర్చీల వితరణ



నూజివీడు: మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయానికి స్థానిక యూనియన్ బ్యాంకు మంగళవారం 20 కుర్చీలను అందజేశారు. మెప్మా కార్యాలయంలో తరచూ ఆర్పీలతో సమావేశాలు నిర్వహించడంతో పాటు టౌన్ లెవెల్ ఫెడరేషన్ సమావేశాలు, స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తారు. కార్యాలయంలో కుర్చీలు సరిపడా లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై యూనియన్ బ్యాంకు అధికారులు స్పందించి కుర్చీలను అందజేశారు. మేనేజర్లు సీహెచ్ రామాంజనేయులు, మహ్మద్ ఇర్ఫాన్ బాషా, ఫీల్డ్ ఆఫీసర్ మురళి, ఇన్‌ఛార్జి సీఎంఎం లటికే నాగోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

- పెనుగంచిప్రోలు: నాణ్యమైన విద్యే లక్ష్యంగా పనిచేయాలని ఎంఈఓ డి. రవీంద్ర అన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఎఫ్‌ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా జ్ఞానజ్యోతి పేరుతో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉషారాణి, సువర్ణ, రిసోర్స్ పర్సన్లు పాము నాగేశ్వరరావు, ప్రకాష్ మాట్లాడారు.

సవరణ

[illegible]

T.V.N. [illegible]